క్లుప్తంగా

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



మరికల్: నారాయణపేటకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారి తరచుగా వాహనదారులు ప్రమాదాలకు గురికావడంతో బుధవారం బీసీకాలనీవాసులు గుంతలను పూడ్చివేత కార్యక్రమం చేపట్టారు. మరికల్ నుంచి అప్పం పల్లి వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టి వేసి పూడ్చివేసి మానవత్వం చాటుకున్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులను కోరిన వారు పట్టిం చుకోకపోవడంతో ప్రమాదాలు జరగకుండా గుంతలు పూడ్చివేస్తున్నట్లు వారు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నారాయణ

మాగనూర్: మండల బీజేపీ నూతన అధ్యక్షు డిగా ఓబ్లాపూర్ గ్రామ సర్పంచ్ నారాయణను నియమించినట్లు బీజేపీ నాయకులు తెలి పారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గస భ్యులు కొండయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ మేరకు.. నారాయణ మాట్లా డుతూ మండలంలో బీజేపీ అభివృద్ధికి తనవం తు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి జన్మదినం

మాగనూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని ఘనంగా నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగు లకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆనం ద్‌గౌడ్, దండు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జలజం సత్యనారా యణ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహం గా కొనసాగుతుంది. పాఠశాలల జట్లు టోరీ ్నలో సత్తాచాటుతున్నారు. బుధవారం జరిగిన మ్యాచుల్లో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కు మార్, విద్యావేత్త లక్ష్మణ్‌లు క్రీడాకారులను పరి చయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ టోర్నీలో ప్రతిభచా టాలని కోరారు. ఓడినవారు నిరాశచెందకుం డా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మూడో రోజు జరిగిన మ్యాచుల్లో క్రిష్ణవేణి స్కూల్ జట్టు 10 వికెట్ల తేడాతో యూనివర్సల్ హైస్కూల్ జట్టుపై, జ్ఞానభారతి స్కూల్ జట్టు 21 పరుగుల తేడాతో మాడ్రన్ హైస్కూల్ జట్టుపై, మాడ్రన్ బేసిక్ స్కూల్ జట్టు 67 పరు గుల తేడాతో కాకతీయ స్కూల్ జట్టుపై, ఫాతిమా విద్యాలయం జట్టు 9 వికెట్ల తేడాతో అపెక్స్ హై స్కూల్ జట్టుపై విజయం సాధిం చాయి.

క్రమశిక్షణ అవసరం

అమరచింత: వసతిగృహంలో చదువుకుం టున్న విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదు వులో రాణించి వసతి గృహానికి పేరు తీసుకురావాలని ఎస్సీ వసతి గృహ వార్డెన్ బెనర్జీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉలెన్ రగ్గు, జామెటరీ బాక్స్, స్పోర్ట్స్ షూ, సాక్స్, ఎగ్జామ్ ప్యాడ్, పెన్సిల్, ఎరెసర్, క్యారమ్‌బోర్డ్, చెస్‌బోర్డ్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యా లు సమకూర్చుతుం దన్నారు. చలికాలంలో వి ద్యార్థులకు ఉపయో గపడే విదంగా ఉలెన్ రగ్గులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ట్యూట ర్స్ సిద్దిక్, ప్రవీణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టీంకు 'పేట' విద్యార్థులు



నారాయణపేట రూరల్: ఆల్ ఇం డియా సౌత్‌జోన్ ఇంటర్ యూని వర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు పాలమూరు యూనివర్సిటీ టీమ్‌లో పేట విద్యార్థులు స్థానం సంపాదిం చుకున్నారు. స్థానిక సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న కే.రాజ్, జే.రాజు పురుషుల, బీజెడ్‌సీ ఫైనల్ ఇయర్‌లో ఉన్న అంజలి స్త్రీల జట్లలో ఆడేం దుకు అవకాశం దొరికిందన్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ రంగారెడ్డి, ఇన్‌చార్జి పీడీ నారాయ ణగౌడ్, ట్రైన ర్ రాజ్‌కుమార్ క్రీడాకారులను అభినందించారు.

కానరాని పబ్లిక్ టాయిలెట్లు

- మండల కేంద్రంలో ప్రజల అవస్థలు
- ఒకటికి, రెంటికీ తప్పని ఇబ్బందులు
- అంతర్రాష్ట్ర ప్రయాణికుల పరిస్థితి అంతే
- పట్టించుకుని అధికారులు, పాలకులు



మాగనూర్ ప్రధాన కూడలిలోని వ్యాపార సముదాయాలు

మాగనూర్: ప్రతినిత్యం అంతర్రాష్ట్ర ప్రయాణికులు, మండలవాసులతో కిటకిటలాడుతున్న మండల కేంద్రంలో జాతీయ రహదారి మార్గంలో పబ్లిక్ టాయిలెట్లు లేక ఇక్కట్లు పడుతున్నారు. ఫలితంగా ఒకటికి, రెంటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర ప్రయాణికులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. టాయిలెట్స్ నిర్మిం చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు మార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు.

నిర్వహణ లేకపోవడంతో..

మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, ఆస్పత్రి ఏరియాతోపాటు ఇతర ప్రధాన కూడళ్లలో ఒంటికి, రెంటికి ఎలాంటి పబ్లిక్ టాయి లెట్లు లేవు. ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న టాయిలెట్లు నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగానే మారాయి. ఒకపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, పల్లె ప్రగతి కార్యక్ర మాలు చేపట్టినా ఇక్కడ వసతులు కల్పించడంలో స్థానిక అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా



మాగనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం (ఫైల్)

వ్యవహరిస్తున్నారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం కోసం రూ.లక్షల నిధులు మంజూరు చేస్తున్నా అవి ఎక్కడ పోతున్నాయో తెలియని పరిస్థితి దాపురిం చింది.

ప్రయాణికుల అవస్థలు..

మండల కేంద్రం మీదుగా నిత్యం హైదరాబాద్ నుంచి రాయచూర్, గోవా లాంటి ప్రాంతాలకు వం దల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, లారీల రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా వాహనాల్లో వందలాది మంది ప్రయాణికుల రాకపోకలు ఇక్కడికి ప్రతినిత్యం కొనసాగుతున్నాయి. ఇక వీరంతా ఒం టికి, రెంటికీ వెళ్లాలంటే ఆరుబయటకు, పొలాలు, గుట్టల వెంట వెళ్లాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..



మండల కేంద్రంలో జాతీయ మార్గానికి ఇరువైపులా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేని మాట వాస్తవమే. అయితే గతంలో ఇక్కడ అంత అవసరం ఉండేది కాదు. ప్రస్తుతం వ్యాపారం పెరిగింది. జనాల రాకపోకలు కూడా పెరిగాయి. ఫలితంగా వాటి అవసరం ఏర్పడింది. ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం.

– రాజు, సర్పంచ్, మాగనూర్

ఇబ్బందులు పడుతున్నాం..



ప్రధాన రహదారి వెంబడి మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడం తో తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాం. ముఖ్యంగా ఇతర గ్రామాల నుంచి మహిళలు వ్యాపార, బ్యాంక్, ఆస్పత్రి అవసరాల నిమిత్తం వస్తుంటారు. వారంతా పడరాని పాట్లు పడుతున్నారు. సంబంధిత అధి కారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– ఎండీ సుల్తాన్, వ్యాపారి, మాగనూర్

స్థలం కొరత ఉంది..



మాగనూర్‌లోని ప్రధాన చౌరస్తాలో మూత్రశా లలు, మరుగుదొడ్ల ఏర్పాటుకు ప్రధాన సమస్య స్థలం లేకపో వడమే. రోడ్డుకు ఇరువై పులా ప్రైవేట్ స్థలాలు ఉండటంతో నిర్మాణా నికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. త్వరలోనే గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిం చేలా చూస్తాం.

– జైపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, మాగనూర్

కాకతీయ కట్టడాలకు బీటలు



కూలేందుకు సిద్ధంగా ఉన్న అలనాటి గ్రామ ముఖద్వారం

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నో శతా బ్దాల చారిత్రక నేపథ్యం కలిగిన కాకతీయుల కట్ట డాలు ప్రస్తుతం బీటలు వారి ఆదరణకు నోచుకోలేక కూలేటట్లున్నాయి. మండల కేంద్రంతోపాటు, పెద్ద కడ్మూర్, ఉందేకోడ్ గ్రామాల్లో కోట బుర్జులు, ముఖ ద్వారాలు ఉన్నాయి. ప్రస్తుతం కొన్నిగ్రామాల్లో గ్రామస్తులు కొంత మేరకు మరమ్మతులు చేపట్టడం తో పాక్షికంగా ఉన్నాయని ఆయాగ్రామాల ప్రజ లంటున్నారు. భావి చరిత్రకు సాక్షిభూతాలైన ఈ కట్టడాలను మరమ్మతు చేపట్టి కాపాడగలిగితే మన ప్రాంత చారిత్రక కట్టడాలు సజీవంగా భవిష్యత్ తరాలకు సాక్ష్యంగా నిలుచుంటాయని వారు కోరు తున్నారు. పురావస్తుశాఖ అధికారులు ఈ కట్టడాల ను సందర్శించి తగిన మరమ్మతులు చేపట్టాలని వారంటున్నారు.

ఉక్కపోతతో విద్యార్థినుల ఇబ్బందులు



తరగతి గదిలో కిటికీని లాక్ చేసిన దృశ్యం

అమరచింత: ఎన్నికల నిర్వహణలో భాగంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసిన అధికారులు తరగతి గదుల కిటికీలను మూసి ఉంచడంతో విద్యార్థినులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో మూడు తరగతి గదులకు ఉన్న కిటికీ లను పూర్తిగా డెకోలం షీట్లతో మూసేశారు. దీంతో తరగతి గదిలోకి గాలి, వెలుతురు రాకపోవడంతో విద్యార్థినులు గదిలో చదువుకోలేక వరండాల్లో చదువుకుంటున్నారని హెచ్‌ఎం కరుణాకర్ తెలి పారు. ఎన్నికల నిర్వహణ పేరిట ముందస్తుగానే తరగతి గదులను లాక్ చేయడంతో విద్యార్థుల చదువులకు అంతరాయం కలుగుతుందని కిటికీలు లాక్ చేయకుండా తెరవడం, మూయడం వంటి పనులు చేయమని మున్సిపల్ కమిషనర్‌కు విన్న వించినా స్పందించడం లేదన్నారు. అధికారులు స్పందించి చదువులకు ఆటంకం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాల్వ మరమ్మతు చేపట్టరా..?



మండలంలోని లైనింగ్ దెబ్బతిన్న భూత్పూరు కెనాల్

నర్వ: మండలంలోని ప్రధాన సాగునీటి వనరులైన భూత్పూరు, సంగంబండ ప్రధాన కాల్వతోపాటు, డిస్ట్రిబ్యూటర్ కాల్వలకు లైనింగ్ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఆయా గ్రామాలకు సాగునీరందించే ఈ కాల్వలకు కొద్ది వరకు మాత్రమే లైనింగ్ పనులు చేపట్టారని, పిల్ల కాల్వలకు ఎక్కడ లైనింగ్ చేయక పోవడంతో నీరు వృథాగా పోతుందని వారు వాపో తున్నారు. గతంలో చేపట్టిన లైనింగ్ అక్కడక్కడ దెబ్బతినడంతో కాల్వలు తెగిపోయి నీరు వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలో లైనింగ్ మరమ్మతులు చేపడితే రైతులకు సక్రమంగా సాగునీరందుతుందని అంటున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు దృష్టిసారించి పనులు చేపట్టాలన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

మరికల్/మాగనూర్/కోస్గి: ఎమ్మెల్యే రాజేం దర్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని బీఆర్ ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండ లంలో వారు ఇంటింటి ప్రచారం చేసి ఓట ర్లను అభ్యర్థించారు. అదేవిధంగా మాగనూర్ మండల బీజేపీ అధ్యక్షుడు జయనంద్‌రెడ్డి బుధవా రం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఆశీర్వదిం చాలని ము న్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష కార్యకర్తలకు సూచించారు. బుధవారం మున్సిపల్ పరిధిలో ఇంటింటి తిరిగి ప్రచారం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక..

సాక్షినెట్ వర్క్: స్థానిక పార్టీ కార్యాలయంలో చిట్టెంపర్నికారెడ్డి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యో గుల సంఘం అధ్యక్షుడు మనోహర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వామన్‌గారి సంతోష్‌కుమా ర్, స్థానిక భైరంకొండకు చెందిన 40 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే మున్సిపల్ పరిధిలోని పలువురు బీఆర్‌ఎస్ నాయ కులు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మం డలంలోని కాంగ్రెస్ నాయకులు కుంభం శివ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన 60 మంది ఆయన ఆధ్వర్యంలో కాంగ్రె స్‌పార్టీలో చేరారు.

శిథిలావస్థ భవనాన్ని తొలగించాలి

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో పురాతన తరగతిగది శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవర ణలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో శిథి లావస్థ భవనంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఏ ప్రమాదం జరగక ముందే శిథిలావస్థ భవనాన్ని తొలగించి, నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరు తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రాజాపూర్‌లో కొనుగోలు కేంద్రం పారంభిస్తున్న ఏఈఓ శ్రీనివాస్ తదితరులు



కందూర్‌లో కొనుగోలు కేంద్రం పారంభిస్తున్న సీఈఓ వెంకటయ్యగౌడ్

రాజాపూర్: మండల కేంద్రంలో బుధవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయశాఖ విస్తరణ అధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడారు. రైతులు తాము పండిం చిన ధాన్యాన్ని తేమ శాతం17కు మించకుండా చూసుకోవాలన్నారు. దీంతో పాటు మట్టిపెల్లలు, తాలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురా వాలని సూచించారు. మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183గా రైతు లుకు చెల్లించనున్నట్లు వివరించారు. అందుకు కోసం ఏఈఓ ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, బ్యాంకుఖాతా కలర్‌జిరాక్స్, బ్యాంకు లింకు ఉన్న రైతు సెల్ నెంబర్, పట్టా పాసుబుక్ జిరాక్స్‌లు కొనుగోలు కేంద్రంలో పీఏసీ ఇన్‌చార్జ్ శేఖర్‌కు అం దజేయాలని పేర్కొన్నారు. రాజాపూర్ మండలం లో మొదటి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించామన్నారు. మండలంలోని గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

అడ్డాకుల: మండలంలోని ఐదు గ్రామాల్లో బుధ వారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కందూర్, పొన్నకల్, రాచాల, గుడిబండ, పెద్దమునుగల్‌ఛేడ్ గ్రామాల్లో అడ్డాకుల సింగిల్‌విండో ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సీఈఓ వెంకటయ్యగౌడ్, ఏఈఓ ప్రవీణ్ ప్రారంభించారు. రైతులు దళారు లను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయించిన కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సీఈఓ వెంకటయ్యగౌడ్ కోరారు. ధాన్యం విక్ర యించే రైతులు తగిన విధంగా తేమ శాతం ఉం డేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సర్వీస్ రోడ్లపై నిర్లక్ష్యం



అచ్చాయపల్లి వద్ద కనిపించని రోడ్డు

- శాఖాపూర్ వద్ద అసంపూర్తిగా సర్వీస్ రోడ్డు
- అచ్చాయపల్లి వద్ద కనిపించని రోడ్డు
- బలీదుపల్లి వద్ద నిరుపయోగమే

అడ్డాకుల: జాతీయ రహదారి సమీపంలోని గ్రామాలు, స్టేజీల వద్ద సర్వీస్ రోడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. కొన్ని చోట్ల సర్వీస్ రోడ్లను అసంపూర్తిగా వదిలేయగా మరి కొన్ని చోట్ల సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారు. అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి స్టేజీ వద్ద హైవేపై రోడ్డు క్రాసింగ్‌ను రహదారి నిర్వాహ కులు మూసి వేశారు. ఇక్కడ ఉన్న సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తేలేదు. దీనివల్ల వాహనాలు బలీదుపల్లి స్టేజీ నుంచి వెల్టూర్ స్టేజీ వరకు రాంగ్ రూట్లో వెళ్తున్నాయి. దీంతో ప్రధాన రహదారిపై వెళ్లే ప్రయాణీకులకు ప్రమాదం పొంచి ఉంది.

అచ్చాయపల్లి వద్ద రోడ్డేది..

మూసాపేట మండలం జానంపేట నుంచి అచ్చా యపల్లి స్టేజీ వరకు సర్వీస్ రోడ్డు లేదు. దీనివల్ల గ్రామస్తులు ప్రధాన రహదారిపై రాంగ్‌రూట్లో ప్రయాణిస్తున్నారు. జానంపేట నుంచి అచ్చాయప ల్లికి వెళ్లాలంటే మూసాపేట చౌరస్తా వరకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. దీనివల్ల అదనంగా కిలో మీటర్ దూరం తిరిగి రావాల్సి ఉండటంతో వాహన దారులు జానంపేట పాత పెట్రోల్ పంపు నుంచి రాంగ్‌రూట్లో అచ్చాయపల్లి స్టేజీ వరకు వెళ్తున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు కూడా రాత్రివేళ రాంగ్‌రూట్లో వెళ్తున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు సర్వీస్ రోడ్లపై దృష్టి సారిస్తే వాహనదారులకు సౌకర్యవంతంగా ఉం టుంది.



శాఖాపూర్ వద్ద సర్వీస్ రోడ్డుపై పాత బీటీని వేసేందుకు చర్యలు



బలీదుపల్లి వద్ద సర్వీస్ రోడ్డు దుస్థితి

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

జానంపేట నుంచి అచ్చాయపల్లికి రావడానికి వాహనాలు మూసాపేట వరకు వెళ్లి రావాల్సి వస్తోంది. స్కూల్‌కు నడిచి వెళ్లే పిల్లలకు ఇబ్బం ది ఉంది. పాత పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న రోడ్డును అచ్చాయపల్లి వరకు సర్వీస్ రోడ్డుగా మారిస్తే బాగుంటుంది.

–పెద్ద నర్సింహులు, అచ్చాయపల్లి

రోడ్డును బాగు చేయించాలి

బలీదుపల్లి స్టేజీ వద్ద హైవేపై రోడ్డు క్రాసిం గ్‌ను మూసి వేశారు. దీనివల్ల రాంగ్‌రూట్లో వెల్టూర్ స్టేజీ వరకు వెళ్తున్నాం. రాత్రివేళ ఇబ్బందిగా ఉంటుంది. బలీదుపల్లి స్టేజీ నుం చి వెల్టూర్ స్టేజీ వరకు సర్వీస్ రోడ్డును బాగు చేయించాలి.

–శ్రీధర్ యాదవ్, బలీదుపల్లి

ఆపరేటర్లు లేక.. సరఫరా కాక



ముళ్లచెట్లలో అప్పంపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

మరికల్: గత 2018 ఎన్నికల హడావుడిలో కొత్తగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. కానీ, మళ్లీ ఎన్నికలు వస్తున్నా ప్రారంభం కాకపోవడం శోచ నీయం. ఐదేళ్ల క్రితం ప్రారంభించిన సబ్‌స్టేషన్లు అడిగే వారు లేక ప్రస్తుతం ముళ్లపొదల్లో శిథిలావస్థకు చేరగా.. సామగ్రి చోరీకి గురవుతోంది. లో ఓల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపో తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడెక్కడ అంటే..

జిల్లాలోని మరికల్, ధన్వాడ మండలాల్లో వెంకటాపూర్, అప్పంపల్లి, గున్ముక్ల, మక్తల్ మండలం గుడిగండ్ల, జలాల్ పూర్, దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇందుకు గాను ఒక్కోదానికి రూ.1.70 కోట్లతో పనులు పూర్తిచేశారు. అప్పట్లో ఎన్నికల సమయం దగ్గర పడటంతో ప్రభుత్వం 2018 ఆగస్టు 12న అప్పటి ఎంపీ జితేందర్‌రెడ్డి చేతులమీ దుగా వీటిని ప్రారంభించారు. సబ్‌స్టేషన్లకు స్థలం ఇచ్చిన భూ యజమాని ఇంట్లో ఒకరికి ఆపరేటర్లను నియమించి వెం టనే సబ్‌స్టేషన్ల పరిధిలోని రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అప్పంపల్లి సబ్‌స్టేషన్‌కు స్థలం ఇచ్చిన కుటుంబంలో ఒకరిని ఆపరేటర్‌గా నియమించి వెంకటాపూర్ సబ్‌స్టేషన్ నడిపిస్తు న్నారు. గున్ముక్ల సబ్‌స్టేషన్‌కు స్థలం ఇచ్చిన ఇంట్లో ఒకరికి ఆపరేటర్‌గా నియమించి గోటూర్ సబ్‌స్టేషన్‌లో నియమిం చారు. మిగతా ఎక్కడా ఆపరేటర్లను నియమించకపోవడం తో సబ్‌స్టేషన్ల నుంచి సరఫరాకు నోచుకోవడం లేదు.

మరికల్, నారాయణపేట నుంచే..

అప్పంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 450, వెంకటాపూర్‌లో 543, గున్ముక్లలో 875, గుడిగండ్లలో 645, కొల్లంపల్లిలో 578, జలా ల్‌పూర్‌లో 469, విఠలాపూర్ పరిధిలో 543 వ్యవసాయ మోటార్ల సర్వీస్‌లు ఉన్నాయి. వీటికి మరికల్, నారాయ ణపేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సర ఫరా కావడం వల్ల తరుచుగా లో ఓల్టేజీ సమస్య ఏర్పడుతుం ది. దీంతో వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోతుండటంతో రైతుల ఆందోళన మేరకు కొత్తగా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించి ఆపరేటర్లను నియమించకపో వడంతో సమస్య తీరడం లేదు. ఆపరేటర్లను నియమించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

కలగానే కొండాపూర్..

ధన్వాడ మండలం కొండాపూర్ శివారులో 2013లో 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించగా.. అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అయితే సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో రాజకీయ రంగు పులుముకోవడంతో పెండింగ్‌లో పడింది. అదే స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించాలని ఓ పార్టీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. అలాగే మరికల్ మండలం కన్మనూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులు సాగు తుండగా.. పూసల్‌పహాడ్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేష న్‌కు స్థలం కేటాయించినా శంకుస్థాపన చేయలేదు.

అడిగే వారు లేక..

అప్పంపల్లి శివారులో కొత్తగా ఏర్పాటుచేసిన 33/11 కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్ ఐదేళ్ల క్రితం ప్రారంభించారు. కానీ, ఆపరేటర్లను నియమించకపోవడంతో విద్యుత్ సరఫరా కావడం లేదు. దీంతో సబ్‌స్టేషన్‌లో ముళ్లచెట్లు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయి. అడిగే దిక్కు లేక సబ్‌స్టేషన్‌లో విలువైన సామగ్రిని దోచుకెళ్లారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఆపరేటర్లను నియ మించి విద్యుత్ సరఫరా చేయాలి.

– తిరుపతిరెడ్డి, సర్పంచ్, అప్పంపల్లి